క్లుప్తంగా

నేడు మంత్రి పర్యటన

మహేశ్వరం: మండల పరిధిలో ఆదివారం మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి పర్యటించనున్నట్లు ఎంపీపీ రఘుమారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పాండుయాదవ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉప్పుగడ్డ తండాలో ఉదయం 10గంటలకు బంజారా ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల ప్రారంభం, కో–ఆపరేటివ్ భవనం ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, చెక్కులు పంపిణీ చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్లు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవ్వాలని కోరారు.

ఆంజనేయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మహేశ్వరం: మండల పరిధిలోని ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి, అమీర్‌పేట్ గ్రామంలో సీతారామాంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి ఆలయంలో దంపతులు సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు, ధర్మకర్తలు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు శ్రీనివాసరావు, ఆలయ ట్రస్టీలు కోరుపోలు రఘుమారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, అమీర్‌పేట్ ఆంజనేయ స్వామి అధ్యక్షుడు అంజయ్య ముదిరాజ్, ఆలయం పూజారి తొం డుపల్లి సంతోష్ శర్మ, వీరేశం ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీసేవ



తుక్కుగూడ: జిన్నాయిగుట్ట శ్రీలక్ష్మీనరిసింహ స్వామి ఆలయంలో శనివారం వైభవంగా అమావ్యాస పల్లకీ సేవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీనర్సింహ్మా దంపతులు విగ్రహాలకు ప్రత్యేక పూజులు చేసి ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించారు. భక్తులకు నక్షత్రహారతి, దర్శనం కలిపించారు. అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ ఆలయ చైర్మన్ గోనమోని శివశంకర్, పూజారులు అజయ్‌శర్మ, మురళీశర్మ, పాలక మండలి సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి



ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్, కౌన్సిలర్లు

తుక్కుగూడ: పరిసరాల పరిశుభ్రతలో ప్రజలందరు భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్మన్ కె.మధు మోహన్, కమిషనర్ వెంకట్రామ్ సూచించారు. శనివారం వారు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్‌లో 6,7,8 వార్డులకు సంబంధించి రెడ్యూస్ రియూస్ రీసైకేషన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బూడిద తేజస్విని, బాకి విలాస్, సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మంత్రిపై ఆరోపణలు మానుకోవాలి

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మయ్య యాదవ్



సమావేశమైన బీఆర్‌ఎస్ నాయకులు

తుక్కుగూడ: నియోజకవర్గ అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు తీసుకువస్తున్న మంత్రి సబితారెడ్డిపై ప్రతిపక్ష నాయకులు ఆరోపణలు మానుకోవాలని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్యయాదవ్ అన్నారు. శనివారం మున్సిపాలిటీ కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధిని చూసి ఓర్వలేకే మంత్రి ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం నియోజకవర్గ అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు తీసుకువచ్చిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సుమన్, నాయకులు రాజు, శ్రీకాంత్, శ్యామేల్ రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భాగ్యలక్ష్మి నేత్రాలు సజీవం

ఆమనగల్లు: ఆమనగల్లు లయన్స్‌క్లబ్ సభ్యులు, కల్వకుర్తి పట్టణానికి చెందిన డా.మురళీధర్ పోల సతీమణి భాగ్యలక్ష్మి ఆకస్మికంగా మృతి చెందారు. దీంతో ఆమె నేత్రాలను ఎల్వీప్రసాద్ కంటి ఆస్పత్రికి అందించారు. ఆమనగల్లు లయన్స్‌క్లబ్ సభ్యురాలు పోల భాగ్యలక్ష్మి గతంలో రెండు నేత్రాలను దానం చేయడానికి అంగీకరించింది.

అవకాశం ఉన్నా.. ఆదాయం సున్నా

- సమన్వయలోపంతో నిర్మాణానికి నోచుకోని మార్కెట్‌యార్డులు
- వసతులు లేక రోడ్లపైనే విక్రయాలు

యాచారం: గ్రామ పంచాయతీలకు గణనీయమైన ఆదాయం వచ్చే అవకాశమున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. గ్రామాల్లో మార్కెట్ యార్డులు ఏర్పాటు చేయండి, ప్రతీ నెల పన్నులు చెల్లిస్తామని చిరు వ్యాపారులు మొరపెట్టుకుంటున్నా పట్టించుకునే వారే లేరు. నందివనపర్తి, గునుగల్, చింతుల్ల, నక్కర్తమేడిపల్లి, కొత్తపల్లి, మంతన్‌గౌరెల్లి తదితర మేజర్ గ్రామ పంచాయతీల్లో స్థానికంగా మార్కెట్ యార్డులు నిర్మించేందుకు నిర్ణయించారు. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు సైతం వచ్చాయి. అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయలోపంతో మార్కెట్ యార్డుల నిర్మాణం అటకెక్కింది. మేజర్ పంచాయతీల్లో రైతులు తమ పొలాల్లో పండించిన కూరగాయలను గ్రామంలోనలి వీధుల్లోనే పెట్టి విక్రయిస్తుంటారు. కొందరు చిరు వ్యాపారులు మాల్, యాచారం మార్కెట్లల్లో కూరగాయలను కొనుగోలు చేసి గ్రామాల్లో విక్రయాలు జరుపుతారు.

వసతి కల్పిస్తే ఆదాయం

మేజర్ గ్రామ పంచాయతీల్లో చిరు వ్యాపారులు రోడ్లపైనే ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు, సాయంత్రం 5గంటల నుంచి 9గంటల వరకు కూరగాయలను విక్రయిస్తుంటారు. గ్రామంలోని ఒక చోటు కల్పిస్తే లైసెన్స్‌లు, పన్నుల రూపంలో పంచాయతీలకు ఏటా రూ.లక్షల్లో ఆదాయం వచ్చే అవకాశం ఉంది. రెండేళ్ల క్రితం నందివనపర్తి గ్రామంలో పంచాయతీ స్థలంలో మార్కెట్ యార్డు నిర్మాణానికి పనులు ప్రారంభించారు. కానీ నేటికి పూర్తి కాలేదు. గ్రామంలోని 50మందికి పైగా చిరువ్యాపారులు ఆయా కాలనీల్లో రోడ్ల పైనే కూరగాయల ఉంచి విక్రయాలు చేస్తుంటారు.

కలగానే మార్కెట్ల నిర్మాణం

నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై యాచారం, మాల్ కేంద్రాల్లో కూరగాయల మార్కెట్లు కలగానే మిగిలాయి. పదేళ్ల క్రితం మాల్ గ్రామంలో కూరగాయల మార్కెట్ ఉండేది. నాలుగేళ్లుగా మార్కెట్ మూతపడింది. మార్కెట్ కోసం రూ.50లక్షలు ఖర్చు చేసి నిర్మించిన దుకాణా సముదాయాలు నేడు నిరుపయోగంగా మారాయి. యాచారంలోనూ మార్కెట్ సౌకర్యం లేదు. వ్యాపారులు పలు గ్రామాల నుంచి తెచ్చిన కూరగాయలను కొనుగోలు చేసి రోడ్ల పైనే విక్రయాలు జరుపుతారు. మాల్‌లోనూ రోడ్లపైనే విక్రయాలు చేస్తున్నారు. యాచారం, మాల్ కేంద్రాల్లో కూరగాయల మార్కెట్ల సౌకర్యం కల్పిస్తే పంచాయతీలకు ప్రతీ సంవత్సరం రూ.5లక్షలకు పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉంది.



మాల్‌లో రోడ్డుపైనే కూరగాయలు విక్రయిస్తున్న చిరువ్యాపారులు

మార్కెట్ యార్డు నిర్మిస్తున్నాం

నందివనపర్తి గ్రామంలో చిరు వ్యాపారుల సౌకర్యార్థం మార్కెట్ యార్డు నిర్మిస్తున్నాం. రూ.25లక్షలకు పైగా నిధులతో నిర్మించి అన్ని వసతులు కల్పిస్తాం. ఒకే చోట కూరగాయలు, మాంసం విక్రయాలు చేసేలా ఏర్పాటు చేస్తాం.

– కె.ఉదయశ్రీ, సర్పంచ్, నందివనపర్తి

చర్యలు తీసుకుంటాం

మేజర్ గ్రామ పంచాయతీల్లో రోడ్లపైనే చిరు వ్యాపారులు కూరగాయలు అమ్ముతున్నారు. గ్రామాల వారీగా ఖాళీ స్థలాలు గుర్తించి మార్కెట్ సౌకర్యం కల్పిస్తాం. పంచాయతీల ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటాం.

– ఉమారాణి, ఎంపీఓ, యాచారం

మిల్లర్లు రైతులకు సహకరించాలి

పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్

మహేశ్వరం: ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైస్ మిల్లర్లు రైతులకు సహకరించాలని కందుకూరు సహకార సంఘం చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్ కోరారు. శనివారం ఆయన కనకదుర్గ రైస్‌మిల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని సూచించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరంతరం రైతు సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ సురసాని సురేందర్ రెడ్డి, పీఏసీఎస్ సీఈఓ నిమ్మ యాదగిరిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న చంద్రశేఖర్, సురేందర్‌రెడ్డి

నేటినుంచి పునఃప్రతిష్ఠాపనోత్సవాలు

ఏర్పాట్లు పూర్తి చేసిన ఉత్సవ కమిటీ సభ్యులు



తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధి ఇమామ్‌గూడ (లక్ష్మీనగర్) గ్రామంలో బొడ్రాయి (నాభిశిల) పునఃప్రతిష్ఠాపనోత్సవాలు ఆదివారం నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లును పూర్తి చేశారు.

ఆదివారం: గ్రామ దేవతల శాంతి పూజలు, బొడ్రాయి గ్రామోత్సవం, శోభాయాత్ర, జలాధివాసం, క్షీరాధివాసం.

సోమవారం: యాగశాలలో ప్రాతఃకాల ఆరాధన, ప్రతిష్ఠాంగ హోమం, నిత్య పూర్ణాహుతి, తీర్థ ప్రసాదాల వితరణ.

మంగళవారం: ఊరి ఆడబిడ్డల చేత పసుపు కుంకుమల పూజ, గ్రామం చుట్టూ పొత్తి పోయుట, గ్రామ దిగ్బంధనము, బలి, సామూహిక బోనాలు

బుధవారం: శీతల దేవి–యంత్రస్థాపన, నాభిశిల–ప్రాణప్రతిష్ఠాపన. బలిహరణము, బొడ్రాయి మహా కుంబాభిషేకం, శాంతి పూజలు, ఉత్సవాల ముగింపు.

హ్యాండ్లూమ్ మేళాకు ప్రజాదరణ

వనస్థలిపురం: వనస్థలిపురంలోని హుడా ఓపెన్ ఆడిటోరియంలో గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీ క్రాఫ్ట్ మేళాకు ప్రజలు ముఖ్యంగా మహిళల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. మేళాలో కొలువైన దుస్తులు, తదితర వస్తువుల కొనుగోలుకు స్థానికులు ఆసక్తి చూపిస్తున్నారు. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్స్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజెస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ నగలు, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి బొమ్మలు, గాజులు, హైదరాబాద్ ముత్యాలు, బ్యాగులు, చెప్పులు తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయని మేళా నిర్వాహకులు అక్బర్ అలీ తెలిపారు. ఈ అవకాశం కొద్ది రోజులు మాత్రమే ఉంటుందని ఆయన పేర్కొన్నారు.



మేళాలో కొనుగోలుదారుల సందడి

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు రాము



విజేతలకు బహుమతులు అందిస్తున్న రాము

ఆమనగల్లు: విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు, సరస్వతి శిశుమందిర్ పాఠశాల చైర్మన్ పాపిశెట్టి రాము సూచించారు. పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో నెల రోజులుగా విద్యార్థులకు నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఈ శిబిరంలో విద్యార్థులకు గ్రామీణ క్రీడలు, భరతనాట్యం, కోలాటం నేర్పించారు. ముగింపు సందర్భంగా విద్యార్థులకు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. శిశుమందిర్ పాఠశాల ఆవరణలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ ఉపాధ్యక్షుడు దొంతు సత్యనారాయణ, కార్యదర్శి చుక్క ఆనంద్, బావండ్ల అంజయ్య, ఉపాధ్యాయులు కవిత, స్వాతి, అనూష, డ్యాన్స్ మాస్టర్ శ్రీనివాస్, నాయకులు మహేశ్, తిరుపతయ్య, ఆంజనేయు లు, శ్రీశైలం, నర్సింహ, ఆనంద్, యాదగిరి, శ్రీదేవి, వనజ, శ్యామల, చంద్రకళ, నిరంజన్ తదితరు లు పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో వేదిక నిర్మించేందుకు ఏలె నిరంజన్ ఆర్థికసాయం అందించారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్

ఆమనగల్లు: మున్సిపాలిటీలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టినట్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో చేపట్టిన పారిశుద్ధ్య పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంపాల్‌నాయక్, దుర్గయ్య మాట్లాడుతూ.. స్వచ్ఛ ఆమనగల్లుకు ప్రజలు సహకరించాలని కోరారు. తడి,పొడి చెత్తను వేర్వేరుగా వాహనాలకు ఇవ్వాలన్నారు. మురుగునీరు రోడ్లపైకి రాకుండా కాల్వలు నిర్మిస్తున్నామని చెప్పారు. ప్రజల సహకారంతో మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చెన్నకేశవులు, శ్రీశైలంయాదవ్, కోఆప్షన్ సభ్యులు శ్రీధర్, మున్సిపల్ సిబ్బంది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు రాంనగర్‌తండాలో సీసీ రోడ్డు పనులను శనివారం మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ ప్రారంభించారు. రూ.45లక్షల నిధులతో చేపట్టే రోడ్డు పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్ కృష్ణనాయక్, కమిషనర్ శ్యాంసుందర్, ఏఈ భార్గవరెడ్డి తదితరులు కలిసి ప్రారంభించారు.

విద్యారంగానికి అధిక ప్రాధాన్యం

జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ



బాలికల జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అనురాధ

ఆమనగల్లు: విద్యారంగ అభివృద్ధికి బీఆర్‌ఎస్ అధిక ప్రాధాన్యత ఇస్తోందని జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు మన ఊరు మన బడి కార్యక్రమం అమలు చేస్తోందని చెప్పారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో రూ.4లక్షల జెడ్పీ నిధులతో మరమ్మత్తులు, రూ.4.27లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు వివరించారు. ఈ మేరకు ఆమె శనివారం పనులను పరిశీలించారు. అనంతరం అనురాధ మాట్లాడుతూ.. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో పర్యటించి సమస్యలుంటే పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో అదనపు నిధులు తీసుకువచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు సరిత, మండల పరిషత్ ఏఈ కృష్ణయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ, భీమయ్య, ఆనంద్, గణేశ్‌నాయక్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు కార్పొరేటరే అడ్డు

మాజీ కార్పొరేటర్ అనితారెడ్డి



మురుగునీటిని పరిశీలిస్తున్న జలమండలి అధికారులు, నాయకులు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనుల పట్ల అవగాహన లేక స్థానిక కార్పొరేటర్ అధికారులను, కాంట్రాక్టర్లను బెదిరిస్తూ అభివృద్ధికి ఆటకంగా మారారని మాజీ కార్పొరేటర్ పారుపల్లి అనితారెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు మహేందర్ యాదవ్ ఆరోపించారు. శనివారం హుడాకాంప్లెక్స్ సౌమ్య అపార్ట్‌మెంట్ ఎదుట నిలిచిన మురుగునీటిని జలమండలి అధికారులతో కలిసి వారు పరిశీలించారు. హుడాకాంప్లెక్స్ కాలనీ నుంచి వెళ్లే భూగర్భ డ్రైనేజీ పైపులైన్‌కు అవుట్‌లెట్ సమస్య ఉంది. ప్రధాన రహదారిలోని ట్రంక్‌లైన్‌కు లింక్ కలపడానికి పనులు వేగంగా చేపడుతున్నాం. వారంలో అవుట్‌లెట్ సమస్య పరిష్కారమవుతుందని జలమండలి డీజీఎం సరిత వివరించారు. అనంతరం బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారం చేయాల్సిన కార్పొరేటర్ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధిపై అవగాహన లేని కార్పొరేటర్ తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బేర బాలకిషన్, హుడాకాంప్లెక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అనుపురాజ్, వార్డు సభ్యులు నర్సింహ్మగౌడ్, రాజేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, వి.శ్రీనివాస్, మల్లేశ్, యాదయ్య యాదవ్, సౌమ్య అపార్ట్‌మెంట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నాలా నిర్మాణం పూర్తయినా మట్టి పోయరా?

హయత్‌నగర్: హయత్‌నగర్ బాతుల చెరువు కట్ట కింద ఉన్న కాలనీల గుండా వరద కాలువను నిర్మించినా చుట్టూ మట్టిని పోయకుండా వదిలేశారని, మట్టిని పోయకుంటే వచ్చే వర్షాకాలంలో స్థానికులు నడవలేని పరిస్థితి ఏర్పడుతుందని డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన అంబేడ్కర్ కాలనీ, ఆర్టీసీ మజ్దూర్ కాలనీ, తిరుమల కాలనీలలో ఆయన పర్యటించారు. నాలా నిర్మాణం కోసం ధ్వంసం చేసిన రోడ్లను తిరిగి నిర్మించాలని లేకుంటే ఆయా కాలనీలు బురదమయంగా మారుతాయన్నారు. అధికారులు వెంటనే స్పందించి నాలా చుట్టూ మట్టిని పోయాలని, ధ్వంసమైన రోడ్లను తిరిగి నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు.

కర్ణాటక ఫలితాలే పునరావృతమవుతాయి

డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

యాచారం: కర్ణాటక ఎన్నికల ఫలితాలే తెలంగాణలో పునరావృతం అవుతాయని పార్టీ శ్రేణులు సమష్టిగా కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. రెండోసారి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన చల్లాను యాచారం మండల నాయకులు శనివారం ఆయన నివాసంలో కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లో కాంగ్రెస్ ఓటు బ్యాంకు పదిలంగా ఉందని కార్యకర్తలంతా సమష్టిగా పనిచేస్తే అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహ, నాయకులు ఎండీ ఘనీ, కావలి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్టీ మారిన వారు కాంగ్రెస్‌లోకి రావాలి

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి నియమితులైన చల్లా నర్సింహారెడ్డిని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూధన్‌రెడ్డి శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో పార్టీ మారిన వారు తిరిగి కాంగ్రెస్‌లోకి రావాలని మధుసూధన్‌రెడ్డి, చల్లా నర్సింహ్మారెడ్డిలు పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యే మంచిరెడ్డికి పరామర్శ

ఇబ్రహీంపట్నం రూరల్: ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తల్లి మంచిరెడ్డి పద్మమ్మ మృతి పట్ల శనివారం కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఎలిమినేడు గ్రామంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వరసకు సోదరి అయిన మంచిరెడ్డి పద్మమ్మ గురువారం రాత్రి స్వగ్రామం ఎలిమినేడులో మృతి చెందింది. శుక్రవారం ఆమె అంత్యక్రియలు పూర్తి అయ్యాయి. ముందే నిర్ణయించిన షెడ్యూల్ వల్ల కేంద్ర మంత్రి ఆమె అంత్యక్రియలకు రాలేకపోయారు. జ్ఞాపకాలను నెమరేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మృతుడి కుటుంబానికి కాలనీవాసుల అండ

మీర్‌పేట: గుండెపోటుతో మృతి చెందిన యువకుడి కుటుంబానికి కాలనీవాసులు అండగా నిలిచారు. తమ వంతు సహాయంగా నిత్యావసర సరుకులను అందజేశారు. మీర్‌పేట నందిహిల్స్ కాలనీకి చెందిన శివ డైయిరీ పార్లర్ నడుపుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కాగా ఆ యువకుడు వారం రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. ఇతనికి రెండేళ్ల పాపతో పాటు భార్య గర్భవతిగా ఉంది. కుటుంబ పెద్దదిక్కును కోల్పోవడంతో నందిహిల్స్ సెంట్రల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు వారి కుటుంబాన్ని ఆదుకునేందుకు నిర్ణయం తీసుకుని నిత్యావసర సరుకులు అందజేశారు. తాము ఎల్లవేలలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏడుదొడ్ల సురేందర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు కాల్వ కృష్ణారెడ్డి, గౌరవ అధ్యక్షుడు సూదిని రాంరెడ్డి, ఇమ్మడిశెట్టి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ రవికుమార్, దుర్గయ్య, కోటేశ్వర్‌రెడ్డి, గోవింద్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.



నిత్యావసర సరుకులు అందజేస్తున్న నందిహిల్స్ కాలనీ ప్రతినిధులు

‘నేలతల్లి’ సేవలు అభినందనీయం

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: పర్యావరణ పరిరక్షణకు నేలతల్లి ఫౌండేషన్ సభ్యులు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనరసింహారెడ్డి అన్నారు. శనివారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్‌ను కలిసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు యువత ముందుకు రావడం ప్రశంసనీయమన్నారు. ఫౌండేషన్‌కు తమవంతు సహకారం అందిస్తామన్నారు. అనంతరం ఫౌండేషన్ నిర్వాహకులు సర్పంచ్‌కు మొక్కలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నేలతల్లి ఫౌండర్ చంటి, సభ్యులు జయేందర్, రామ్‌తేజ్, ముఖేశ్ నాయకులు వెంకటేశ్, అంజి, శ్రీనివాస్ తదితరులున్నారు.



మొక్కలు అందజేస్తున్న నేలతల్లి ఫౌండేషన్ సభ్యులు

ఇబ్రహీంపట్నంలో ఎర్రజెండా ఎగురవేద్దాం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ

తుర్కయంజాల్: నియోజకవర్గంలో ఎర్రజెండా ఎగురవేసేందుకు పార్టీ శ్రేణులు ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని రొక్కం సత్తిరెడ్డి గార్డెన్స్‌లో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు డి.కిషన్ అధ్యక్షతన అబ్దుల్లాపూర్‌మెట్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, ఉపాధి అవకాశాలు కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే బీజేపీని కర్ణాటక ఎన్నికల్లో ప్రజలు ఓడించారని, తెలంగాణలోనూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. అర్హులైన పేదలకు 120గజాల ఇంటి స్థలాన్ని మంజూరు చేయాలని, ఇంటి స్థలం ఉన్న వారికి ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షల ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.రాజు, ఎం.చంద్రమోహన్, జిల్లా కమిటీ సభ్యులు ఏర్పుల నర్సింహ, నాయకులు గోరింకల నర్సింహ, కె.అరుణ్ కుమార్, కె.శారద, ఎం.సత్యనారాయణ, బి.శంకరయ్య, ప్రకాష్‌కారత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాన్‌వెస్లీ